సమగ్ర తెలుగు దినపత్రిక

Website: www.adugunews.com

# అడుగు

The Step Towards The Truth..

హైదరాబాద్ | బుధవారం 08 ఏప్రిల్ 2026 | సంపుటి: 02 | సంచిక: 51 | పేజీలు: 4 | వెల: రూ.6:50

Published from Telangana, Andhra Pradesh | చీఫ్ ఎడిటర్: డాక్టర్ మార్గం లక్ష్మీనారాయణ | Mail: adugudaily@gmail.com

## వలస కార్మికులకు 5కిలోల సిలిండర్లు

**రాష్ట్రాలకు సూచించిన కేంద్రం**

న్యూఢిల్లీ,ఏప్రిల్7(అడుగు న్యూస్): వలస కార్మికులకు కేంద్రం ఊరట కలిగించింది. వారికి గ్యాస్ సరఫరాపై పెట్రోలియం మంత్రిత్వ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. వలస కార్మికులకు 5 కేజీల ఎఫ్‌టీఎల్ గ్యాస్ సిలిండర్ల సరఫరా రెట్టింపు చేయాలని రాష్ట్రాలను కేంద్రం కోరింది. ఈ మేరకు పెట్రోలియం శాఖ కార్యదర్శి నీరజ్ లేఖ రాశారు. ఓఎంసీల సహాయంతో పౌర సరఫరాల శాఖ ద్వారా గ్యాస్ పంపిణీ

మిగతా 3లో..

## స్టేకు ఎన్జీటీ నిరాకరణ

**ఫ్యూచర్ సిటీపై ప్రభుత్వానికి ఊరట**

**తదుపరి విచారణ జూన్ 9కి వాయిదా**

న్యూఢిల్లీ,ఏప్రిల్7(అడుగు న్యూస్): ఫ్యూచర్‌సిటీ అభివృద్ధి విషయమై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్జీటీ) చెన్నై ధర్మాసనంలో రాష్ట్ర ప్రభుత్వానికి ఊరట లభించింది. ఈ ప్రాజెక్టుపై ఎలాంటి స్టే ఇవ్వడానికి ఎన్జీటీ నిరాకరించింది. ఎన్విరాన్‌మెంటల్ ఇంపాక్ట్ అసట◌స▯మెంట్ (పర్యావరణ ప్రభావ మదింపు) నోటిఫికేషన్ - 2006లో పేర్కొన్న ప్రకారం పర్యావరణ అనుమతులు లేకుండానే

మిగతా 3లో..

# బిగ్ బ్రేకింగ్!

# యుద్ధానికి రెండు వారాల బ్రేక్!!



## కాల్పుల విరమణకు ఇరు దేశాల అంగీకారం?

- ఇరాన్‌పై సైనిక చర్యను నిలిపి వేసిన ట్రంప్
- పాక్ ప్రధానితో మాట్లాడానన్న అగ్రరాజ్యం
- పాకిస్తాన్ కోరడంతో అంగీకరించిన అమెరికా
- అమెరికా ప్రతిపాదనకు సరేనన్న ఇరాన్!
- పాక్ అభ్యర్థన మేరకే శాంతి చర్చలకు సమ్మతి
- సాయుధ పర్యవేక్షణలో హార్మూజ్ లో రాకపోకలు
- యుద్ధం శాశ్వతంగా ముగిసినట్లు కాదు...
- దౌత్యపరమైన చర్చల కోసమే యుద్ధ విరామం

వాషింగ్టన్,ఏప్రిల్7(అడుగు న్యూస్): అమెరికా, ఇరాన్ మధ్య నెలకొన్న తీవ్ర యుద్ధ వాతావరణం తాత్కాలి కంగా చల్లబడింది. ఇరాన్‌పై చేపట్టాలనుకున్న సైనిక దాడులను రెండు వారాల పాటు నిలిపివేస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన చేశారు. తాను విధించిన గడువు ముగియడానికి కేవలం రెండు గంటల ముందు ఆయన ఈ నిర్ణయం తీసుకోవడం ప్రపంచవ్యాప్తంగా ఉత్కంఠను తగ్గించింది.

మిగతా 2లో..



## దద్దరిల్లిన ఖర్గ్ ద్వీపం!

- ఇరాన్ అంతం.. అమెరికా పంతం
- ఈ రాత్రే ఇరాన్ నాగరికత సర్వనాశనం : ట్రంప్
- అణుదాడికి అమెరికా సిద్ధమైందా?: అనుమానాలు
- హడావుడిగా కాదని ప్రకటించిన వైట్ హౌస్ వర్గాలు
- చూస్తూ ఊరుకోం.. కోటిన్నరమందిమి సిద్ధం :ఇరాన్
- సంధికి ముందే..బాంబులతో విరుచుకుపడ్డ అమెరికా
- దీటుగా సమాధానమిచ్చిన ఇరాన్ నాయకత్వ వర్గాలు
- పశ్చిమాసియాలో పతాక స్థాయికి చేరిన ఉత్కంఠ

వాషింగ్టన్,ఏప్రిల్7(అడుగు న్యూస్): పశ్చిమాసియాలో పరిస్థితులు మరింత చేదాటుతున్నాయి. ట్రంప్ హెచ్చరించినట్లుగానే గడువుకు ముందే ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ భీకర దాడులు చేపట్టాయి. విద్యుత్ ప్లాంట్లు, బ్రిడ్జ్‌లు లక్ష్యంగా దాడులు జరుగుతున్నాయి. ఇరాన్‌లోని ఖర్గ్ ద్వీపంపై కూడా అమెరికా క్షిపణి దాడులు చేసింది. అలాగే కరాజ్ నగరంలో విద్యుత్ ప్లాంట్‌పై దాడి చేయగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. చమురు కేంద్రమైన ఖార్గ్ ద్వీపాన్ని లక్ష్యంగా చేసుకుని పలు దాడులు జరిగాయని ఇరాన్‌కు చెందిన మెహర్ న్యూస్ పేర్కొంది. ఇక ఇరాన్‌లో రైల్వే సర్వీసులు కూడా నిలిచిపోయాయి. ఇరానీయులు

మిగతా 2లో..

# మోదీ.. పినరయ్ గాడ్ ఫాదర్!

- అందుకే బంగారం స్మగ్లింగ్ కేసుల్లో రక్షణ
- కేరళంలో ఇక ఎల్‌డిఎఫ్‌కు కాలం చెల్లింది
- విజయన్ విమర్శలను తిప్పి కొట్టిన రేవంత్
- రేవంత్ ను మావాళ్ళు చూసుకుంటారు:పినరయ్
- కేరళం ప్రచారంలో ఇద్దరు సీఎంల మాటల ఈటెలు
- చర్చకు దిగను.. హద్దులు దాటే భాష విమర్శ కాదు: రేవంత్



తిరువనంతపురం,ఏప్రిల్7(అడుగు న్యూస్): కేరళ ప్రజలను పినరయి విజయన్ మోసం చేస్తున్నారని కేరళ ఎన్నికల ప్రచారంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మరోమారు విమర్శలు గుప్పించారు. ఈ విషయంలో తాను చర్చకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. పినరయి విజయన్.. మోదీ నుంచి సూచనలు తీసుకుంటున్నారు. వారి మధ్య ఒప్పందం ఉంది. కేసుల నుంచి మోదీ ఆయనను రక్షిస్తున్నారు. రాష్ట్రంలో యువతను విజయన్ మోసం చేస్తున్నారు. కేరళ ప్రజల నుంచి నాకు ఫీడ్‌బ్యాక్ వచ్చింది. విజయన్‌కు కేసీఆర్ మంచి మిత్రుడు. కేసీఆర్ పాలన గురించి విజయన్ ప్రస్తావించారని రేవంత్ అన్నారు. కేరళం యువత హార్డ్ వర్కింగ్ పీపుల్ అని సీఎం రేవంత్‌రెడ్డి కొనియాడారు. తాజాగా కేరళం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న సీఎం రేవంత్ అక్కడి ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. గల్ఫ్ దేశాల అభివృద్ధిలో కేరళం యువత పాత్ర కీలకమన్నారు.

మిగతా 3లో..

## ఆ రాష్ట్రాల్లో రేపే ఎన్నికలు

**ముగిసిన ప్రచారం.. భారీగా ఏర్పాట్లు**

తిరువనంతపురం,ఏప్రిల్7(అడుగు న్యూస్): కేరళం, పుదుచ్చేరి, అస్సాంలో ఎన్నికల ప్రచారానికి తెరపడింది. మైకులన్నీ మూగబోయాయి. చివరి రోజున మాత్రం అన్ని పార్టీలు హోరా-హోరీగా ప్రచారం నిర్వహించాయి. పుదుచ్చేరితో పాటు అస్సాం, కేరళం రాష్ట్రాల్లో గురువారం పోలింగ్ జరగనుంది. ఇందుకోసం ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు చేసింది. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా ఐదు రాష్ట్రాల్లో ఎన్నికలు జరుగుతున్నాయి. తొలి విడతలో కేరళం, పుదుచ్చేరి, అస్సాంలో ఏప్రిల్ 9న ఎన్నికలు

మిగతా 2లో..

## ఆ 3 రోజులు మహిళల్ని..

- అంటరానివారుగా చూడొద్దు!
- మహిళల ఆలయ ప్రవేశం..
- వారి వయసుపైనే ఆధారం
- అది మత విశ్వాసం...
- న్యాయ సమీక్ష కిందకు రాదు : కేంద్రం
- సుప్రీంలో శబరిమల కేసు విచారణ



న్యూఢిల్లీ,ఏప్రిల్7(అడుగు న్యూస్): ప్రాచీనకాలం నుంచి కొనసాగుతోన్న సంప్రదాయాలకు అనుగుణంగానే శబరిమల ఆలయంలో మహిళలకు ప్రవేశ నిషేధం విధించారు కానీ.. దీనికి సంబంధించి వివక్ష ఏమీ లేదని కేంద్రం సుప్రీంకోర్టుకు తెలిపింది. మహిళల ప్రవేశాన్ని అనుమతించడమనేది ఆరాధనా స్వరూపాన్నే మార్చివేస్తుంది. ఆలయ

మిగతా 2లో..

# కరువు కోరలు

**మండిపోనున్న భూగోళం**

**ముంచుకొస్తున్న సూపర్ ఎల్ నినో**

న్యూఢిల్లీ,ఏప్రిల్7(అడుగు న్యూస్): ప్రపంచవ్యాప్తంగా వాతావరణ మార్పులు ఆందోళన కలిగిస్తున్న వేళ, శాస్త్రవేత్తలు మరో పిడుగులాంటి వార్తను వినిపించారు. ఈ ఏడాది 'సూపర్ ఎల్ నినో' ఏర్పడే అవకాశాలు మెండుగా ఉన్నాయని, దీని ప్రభావంతో

మిగతా 2లో..

## 'మామ' నుంచి భూమి!

**మామకు అత్యంత చేరువగా మన వ్యోమగాములు**

న్యూఢిల్లీ,ఏప్రిల్7(అడుగు న్యూస్): నాసా ప్రతిష్టాత్మక ఆర్టెమిస్ XX మిషన్ వ్యోమగాములు సోమవారం (ఏప్రిల్ 6, 2026) చంద్రుడికి అత్యంత చేరువగా వెళ్లారు. ఓరియన్ క్యాప్సూల్ నుంచి చంద్రుడి ఉపరితలాన్ని చూసిన వ్యోమగాములు ఆ అనుభూతిని "అద్భుతం" అని వర్ణించారు. పైలట్ విక్టర్ గ్లోవర్ హ్యూస్టన్లోని మిషన్ కంట్రోల్తో మాట్లాడుతూ..

మిగతా 3లో..



## ఏసీబీ వలలో వ్యవసాయ అసోసియేటెడ్ డీన్

- ఓ విత్తన సంస్థ లైసెన్స్ కోసం రూ.1లక్ష డిమాండ్
- రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్న ఏసీబీ అధికారులు

హైదరాబాద్, ఏప్రిల్ 7 (అడుగు న్యూస్): రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం అసోసియేట్ డీన్ గోవర్ధన్ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) వలకు చిక్కారు. విత్తన కంపెనీకి లైసెన్సు మంజూరు చేయడానికి గాను ఆయన లంచం

మిగతా 2లో..

## ఎరుపెక్కిన కర్రె గుట్టల్లో.. శాంతి గీతం!

- తెలంగాణలో ముగిసిన మావోల శకం
- పలు అభివృద్ధి పనులకు డీజీపీ శ్రీకారం

ములుగు,ఏప్రిల్7(అడుగు న్యూస్): తెలంగాణలో మావోయిస్టుల శకం ముగిసిందని డిజిపి శివధర్ రెడ్డి అన్నారు. ఒకప్పుడు తుపాకుల

మిగతా 3లో..

# హరీశ్ అరెస్ట్

- పరిగి దీక్షకు వెళుతుండగా ఘటన
- అప్పా జంక్షన్ వద్ద బీఆర్ఎస్ ఆందోళన
- సబిత, ఎర్రబెల్లిలను పీఎస్ కు తరలింపు
- భూములపై ఉన్న శ్రద్ధ, పాలనపై లేదు
- సర్కార్ తీరుపై కేటీఆర్ ఆగ్రహం

హైదరాబాద్, ఏప్రిల్ 7 (అడుగు న్యూస్): పరిగి ప్రాంతంలో రైతుల భూములను బలవంతంగా స్వాధీనం చేసుకుంటున్నారని ఆరోపిస్తూ సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్ర విమర్శలు చేశారు. ఆరు గ్యారెంటీలను 100 రోజుల్లో అమలు చేస్తామని చెప్పిన ప్రభుత్వం 900 రోజులు గడిచినా ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. రైతులను పరామర్శించేందుకు పరిగికి వెళ్తుండగా పోలీసులు అడ్డుకొని అరెస్టు చేయడాన్ని ఆయన ఖండించారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం క్షీణించిందని, ప్రశ్నించే గొంతులను అణచివేస్తున్నారని ఆరోపించారు.

మిగతా 3లో..



సమగ్ర తెలుగు దినపత్రిక
అడుగు
The Step Towords The Truth..

## సంపాదకీయం
## మార్గం - అడుగు



### అభివృద్ధి నిరోధకంగా పార్టీలు, నేతలు!

ప్రజాస్వామ్యానికి రాజకీయాలు ప్రాణం అయితే, అభివృద్ధి ఆత్మ. ఈ రెండింటి మధ్య సన్నని విభజన రేఖను చెరిపేస్తూ, విస్మరిస్తూ, వాటిని కలగలిపి స్వార్థపూరితంగా ఉపయోగిస్తే రాష్ట్రాల పురోగతే కాదు, ప్రజల భవిష్యత్తు కూడా దెబ్బతింటుంది. తెలంగాణలో మూసీ ప్రక్షాళన, ఆంధ్రప్రదేశ్‌లో అమరావతి నిర్మాణం చుట్టూ ముసురుకుంటున్న వివాదాలు, జరుగుతున్న పరిణామాలు విపరీతంగా ఉన్నాయి. అభివృద్ధి అంశాలను రాజకీయ లాభనష్టాలతో బేరీజు వేసే ధోరణి పెరిగితే, దీర్ఘకాల ప్రయోజనాలు పక్కనపడి తాత్కాలిక ప్రయోజనాలే ప్రాధాన్యం సంతరించుకుంటాయి.

తెలంగాణలో మూసీ నది ప్రక్షాళన అనివార్యం. అరమరికలు అవసరం లేని వాస్తవం. హైదరాబాద్ నగరం నుంచి రోజుకు 1,400 నుండి 1,600 మిలియన్ లీటర్ల మురుగునీరు ఉత్పత్తి అవుతుందని అంచనా. ఇందులో ఎక్కువ భాగం నేరుగా మూసీలో కలుస్తోంది. ఇది పర్యావరణానికి, ప్రజల ఆరోగ్యానికి తీవ్రమైన ముప్పు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రక్షాళన చర్యలు అత్యవసరం. అయితే, ఈ ప్రాజెక్ట్ పై రాజకీయ వివాదాలు నెలకొనడం ఆందోళనకరం. అధికార పార్టీ పట్టుదలతో ముందుకు వెళ్లాలనుకుంటే, ప్రతిపక్షాలు ప్రత్యామ్నాయ మార్గాలు కూడా చూపకుండా, కేవలం వ్యతిరేకతకే పరిమితం కావడం విడ్డూరం.

నిర్వాసితుల సమస్య సున్నితమైంది. ఏ అభివృద్ధి ప్రాజెక్ట్ అయినా ప్రజల సహకారం లేకుండా సాధ్యం కాదు. అందుకే "ఇల్లుకు ఇల్లు, భూమికి భూమి" అనే విధంగా సరైన పునరావాస విధానం ఉండాలి. గత అనుభవాల ప్రకారం సరైన పరిహారం ఇవ్వకపోతే ప్రజా వ్యతిరేకత పెరుగుతుంది. అభివృద్ధి పేరుతో ప్రజలను ఇబ్బందులకు గురి చేయడం సరైన విధానం కాదు.

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణం గత కొన్ని సంవత్సరాలుగా రాజకీయ వివాదాల కేంద్రంగా మారింది. 2019లో భారీ మెజారిటీతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం తర్వాత మూడు రాజధానుల ప్రతిపాదన తీసుకురావడం, తరువాత దానిపై స్పష్టత లేకపోవడం వల్ల ప్రాజెక్ట్ నిలిచిపోయింది. 33 వేల ఎకరాల భూమి రైతులు ఇచ్చిన ఈ ప్రాజెక్ట్ ఆలస్యం కావడం వల్ల వారి ఆశలు కూడా నిలిచిపోయాయి. రాజధాని నిర్మాణం అంటే కేవలం భవనాలు కాదు. అది సామాజిక, ఆర్థిక, పరిపాలన అభివృద్ధికి కేంద్ర బిందువు.

అభివృద్ధి నిరంతర ప్రక్రియ. హైదరాబాద్ నగరం ప్రస్తుత స్థాయికి చేరుకోవడానికి శతాబ్దాల చరిత్ర ఉంది. అదే విధంగా అమరావతి కూడా ఒక్కరోజులో మహానగరంగా మారదు. దీర్ఘకాల ప్రణాళిక, స్థిరమైన విధానాలు అవసరం. కానీ రాజకీయ మార్పులతో ప్రాజెక్ట్ ల దిశ మారిపోతే పెట్టుబడిదారుల నమ్మకం కోల్పోతుంది. ప్రభుత్వాల పట్ల ప్రజల విశ్వాసం సన్నగిల్లుతుంది.

ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో విశాఖపట్నం ప్రధాన ఆదాయ వనరు. కానీ, సమగ్రంగా అభివృద్ధి చెందిన రాజధాని నగరం ఉంటే, రాష్ట్ర ఆర్థిక స్థితి మరింత బలపడుతుంది. అంచనాల ప్రకారం, సరైన ప్రణాళికతో అమరావతి అభివృద్ధి చెందితే రాష్ట్రానికి వేల కోట్ల రూపాయల ఆదాయం వచ్చే అవకాశముంది. ఇది ఉపాధి అవకాశాలను కూడా విస్తరించగలదు.

రాజకీయ నాయకులు అధికారంలో ఉన్నప్పుడు ప్రజల అవసరాలను ముందుంచాలి. కేవలం సంక్షేమ పథకాలతోనే అభివృద్ధి సాధ్యం కాదు. రేషన్, ఉచిత బస్సు, నగదు పంపిణీ వంటి పథకాలు తాత్కాలిక ఉపశమనం కలిగించవచ్చు, కానీ దీర్ఘకాల అభివృద్ధికి మౌలిక సదుపాయాలు, పరిశ్రమలు, విద్యా సంస్థలు అవసరం. అదే సమయంలో సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించడం కూడా సరికాదు. రెండింటి మధ్య సమతౌల్యం, సమన్వయం అవసరం.

ఇందులో అధికార పక్షం సహా, ప్రతిపక్షాల పాత్ర కూడా కీలకం. ప్రతిపక్షాలు కేవలం విమర్శలకు పరిమితం కాకుండా నిర్మాణాత్మక సూచనలు ఇవ్వాలి. ఇక ప్రభుత్వం కూడా పారదర్శకత. భూకబ్జాలు, అవినీతి ఆరోపణలు వస్తున్నప్పుడు వెంటనే స్పందించాలి. నిశ్శబ్దం అనుమానాలకు తావిస్తుంది. విశ్వసనీయత కోల్పోతే అభివృద్ధి కార్యక్రమాలు కూడా ప్రశ్నార్థకంగా మారతాయి.

రాజకీయాలు అభివృద్ధిని నడిపించాలి గాని అడ్డుకోకూడదు. నాయకులు తాత్కాలిక రాజకీయ, లాభాల కోసం కాకుండా, దీర్ఘకాలిక ప్రజా ప్రయోజనాల కోసం ఆలోచించాలి. ప్రజలు కూడా భావోద్వేగాలకు లోనుకాకుండా దీర్ఘకాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని నిర్ణయాలు తీసుకోవాలి. అప్పుడే రాష్ట్రాలు నిజమైన అభివృద్ధి దిశగా ముందుకు సాగుతాయి. లేదంటే రాజకీయాల కలుషిత ప్రభావంలో అభివృద్ధి అనే లక్ష్యం ఎప్పటికీ నెరవేరని కలగానే మిగిలిపోతుంది.

## కాంగ్రెస్ కోసం సైనికుల్లా పనిచేయాలి

### నాగర్ కర్నూలు కాంగ్రెస్ కార్యక్రమంలో పీసీసీ చీఫ్

నాగర్ కర్నూల్,ఏప్రిల్7(అడుగు న్యూస్): తెలంగాణలో కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి రావాలంటే సైనికుల్లా పని చేయాలని పార్టీ కార్యకర్తలకు పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. తెలంగాణలో బీఆర్ఎస్, బీజేపీలు అధికారంలోకి రావని ఆయన జోస్యం చెప్పారు. బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కావాలని బావా బామ్మర్దులు హరీశ్ రావు, కేటీఆర్ కొట్లాడుకుంటున్నారని విమర్శించారు. మంగళవారం నాగర్ కర్నూల్‌లో కొత్తగా ఏర్పాటైన జిల్లా కాంగ్రెస్ పార్టీ నేతల ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పీసీసీ చీఫ్ మాట్లాడుతూ.. ప్రధాని మోదీ పేదలకు చేసింది ఏమి లేదన్నారు. అలాంటి పార్టీ రాష్ట్రంలో ఎలా అధికారంలోకి వస్తుందని ప్రశ్నించారు.

కాంగ్రెస్ పార్టీ గుండెకాయ గ్రామాల్లో ఉందని మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. గ్రామాల్లోకి వెళ్లి కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయండంటూ కేడర్‌కు ఈ సందర్భంగా ఆయన సూచించారు. కులాలకు, మతాలకు, ప్రాంతాలకు అతీతంగా పని చేసే కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడి పని చేయాలని కేడర్‌కు స్పష్టం చేశారు. పార్టీలో అందరికీ అవకాశాలు వస్తాయని పేర్కొన్నారు. అలాగే పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును పూర్తి చేసి.. లక్షల ఎకరాలకు సాగు నీరు ఇవ్వాలన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించాలని కేంద్రాన్ని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ.. తన పాదయాత్రలో అన్ని విషయాలను తెలుసుకున్నారని వివరించారు. అందుకే స్థానిక ఎన్నికల్లో బీసీలకు 52 శాతం రిజర్వేషన్లు ఇచ్చామని పీసీసీ చీఫ్ తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రతి పేదవాడికి రేషన్ కార్డు మంజూరు చేశామని టీ పీసీసీ చీఫ్ చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ళు, సన్న బియ్యం, ఉచిత ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించిన ఘనత కాంగ్రెస్ పార్టీకే చెందుతుందన్నారు. పార్టీ అగ్రనేత సోనియాగాంధీ ఇచ్చిన మాట ప్రకారం.. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఇచ్చారని గుర్తు చేశారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసమే తెలంగాణ వచ్చిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పది సంవత్సరాలలో ఎన్ని నిధులు ఇచ్చారు? ఎన్ని నియామకాలు చేశారు? అంటూ ఆ పార్టీ నేతలకు టీ పీసీసీ చీఫ్ సూటిగా ప్రశ్నలు సంధించారు.

## యుద్ధానికి రెండు వారాల బ్రేక్!!



మొదటిపేజీ తరువాయి..

పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, ఫీల్డ్ మార్షల్ అసిమ్ మునీర్ చేసిన అభ్యర్థన మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ట్రంప్ తన 'ట్రూత్ సోషల్' మీడియా ఖాతాలో వెల్లడించారు. అయితే, ఇరాన్ తక్షణమే హార్ముజ్ జలసంధిని రెండు వారాల పాటు సురక్షితంగా తెరవాలనే షరతుకు కట్టుబడి ఉండాలని ఆయన స్పష్టం చేశారు. దీనిని ఇరుపక్షాల కాల్పుల విరమణగా ఆయన అభివర్ణించారు. ఈ ప్రకటనకు కొద్ది గంటల ముందు, 'ఈ రాత్రికి ఒక నాగరికత అంతరించిపోతుంది' అంటూ ట్రంప్ తీవ్ర హెచ్చరికలు చేయడం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. అయితే, ఇరాన్ నుంచి వచ్చిన 10 సూత్రాల ప్రతిపాదన చర్చలకు ఆమోదయోగ్యంగా ఉందని ట్రంప్ పేర్కొనడంతో వాతావరణం మారింది. కీలకమైన చమురు రవాణా మార్గమైన హార్ముజ్ జలసంధిని పునరుద్ధరించడానికి ఇరాన్ నిర్ణయం తీసుకోవడంపై మా నెక్స్ట్ స్టెప్ ఉంటుంది. ఇరాన్ ఇస్లామిక్ రిపబ్లిక్ హార్ముజ్ జలసంధిని పూర్తిగా, సురక్షితంగా తిరిగి తెరవడానికి అంగీకరిస్తేనే మేం కాల్పులు, దాడులపై వెనక్కు తగ్గుతాం. దాంతో రెండు వైపులా కాల్పుల విరమణ జరుగుతుంది. ఇప్పటికే అన్ని సైనిక లక్ష్యాలను సాధించాం. ఇరాన్‌తో శాశ్వత శాంతి, మధ్యప్రాచ్యంలో స్థిరత్వం కోసం ఒక ఒప్పందం చేసుకోవడంలో మేం బాగా ముందుకు వెళ్తున్నాం. ఇరాన్ 10 పాయింట్ల ప్లాన్ సమర్పించింది. ఇది చర్చలకు ఆచరణాత్మక పునాదిని అందిస్తుందని భావిస్తున్నానని' ట్రంప్ అన్నారు. షెహబాజ్ షరీఫ్, ఆసిమ్ మునీర్‌తో చర్చల తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నట్లు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. సంయమనం పాటించాలని, బలగాలను ఉపయోగించడాన్ని వాయిదా వేసుకోవాలని పాక్ కోరినందుకు ఆయన వారి పాత్రను అంగీకరించారు. పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, ఫీల్డ్ మార్షల్ ఆసిమ్ మునీర్‌తో చర్చల తర్వాత ఇరాన్‌పై షెడ్యూల్ చేసిన విధ్వంసక దాడులను వాయిదా వేసినట్లు ట్రంప్ వివరించారు.

## దద్దరిల్లిన ఖర్గ్ ద్వీపం!

మొదటిపేజీ తరువాయి..

రైళ్ల ప్రయాణాలకు దూరంగా ఉండాలని ఇజ్రాయెల్ హెచ్చరించింది. అంటే రైళ్లను ఇజ్రాయెల్ టా÷–గ్గ÷ట్ చేసుకుందన్న హెచ్చరికల నేపథ్యంలో ఇరాన్ ముందుగా స్టేషన్లు, రైలు సర్వీసులను నిలిపివేసింది. ఫిబ్రవరి 28 నుంచి పశ్చిమాసియా యుద్ధం జరుగుతోంది. ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా సంయుక్తంగా దాడి చేశాయి. ఈ ఘటనలో ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ హతమయ్యారు. అంతేకాకుండా పలువురు కీలక నేతలు కూడా చనిపోయారు. అప్పటి నుంచి ఇరాన్ కూడా ప్రతీకార దాడులతో చెలరేగిపోయింది. గల్ఫ్ దేశాలు లక్ష్యంగా క్షిపణులు ప్రయోగించింది. అంతేకాకుండా హార్ముజ్ జలసంధిని మూసేసింది. దీంతో ప్రపంచ దేశాల్లో చమురు, గ్యాస్ సంక్షోభం తలెత్తింది. అయితే హార్ముజ్ జలసంధిని తెరవాలని ట్రంప్ డెడ్‌లైన్ విధించారు. ఒప్పందం చేసుకోకపోతే 48 గంటల్లో ఇరాన్‌ను సర్వ నాశనం చేస్తామని ట్రంప్ బెదిరించారు. అయితే ఒప్పందం చేసుకునేందుకు ఇరాన్ ససేమిరా అంది. ఎట్టి పరిస్థితుల్లో ఒప్పందం చేసుకోబోమని తేల్చి చెప్పింది. తాజాగా ఒప్పందం రద్దు కావడంతో డెడ్‌లైన్‌కు ముందుగానే అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా భీకర దాడులు చేస్తున్నాయి. దీంతో పరిస్థితులు తీవ్ర ఉద్రిక్తంగా మారాయి. ఇరాన్ ఆర్థిక కిరీటమైన ఖర్గ్ ఐలాండ్ పై మరోసారి దాడులు జరిగాయని స్థానిక మీడియా వెల్లడించింది. హార్మూజ్ జలసంధిని పూర్తిగా తెరిచేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌కు విధించిన గడువుకు కొన్ని గంటలే మిగిలి ఉన్నవేళ ఖర్గ్‌తో పాటు ఆ దేశంలోని రహదారులు, రైల్వే వంతెనలపై భారీ దాడులు చోటుచేసుకున్నాయి. ద్వీపంలోని మిలిటరీ టా÷–గ్గ÷ట్లపైనా అమెరికా-ఇజ్రాయెల్ బాంబుల వర్షం కురిపించాయి. మార్చినెలలో కూడా అమెరికా ఓసారి ఈ ప్రాంతంలో దాడులు చేసింది. తాజా దాడుల నేపథ్యంలో ఇజ్రాయెల్-అమెరికాకు ఇరాన్ హెచ్చరికలు చేసింది. ఇన్నాళ్లు యుద్ధం ముగింపు గురించి ఓపికతో ఎదురు చూశామని..ఇక తమ సహనం నశించిందని ఐఆర్‌జీసీ పేర్కొంది. అమెరికా, ఇజ్రాయెల్ సహా వాటి మిత్ర దేశాలపై దాడులు చేస్తామని వెల్లడించింది. ఆయా దేశాలలోని మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకుంటామని..చమురు, గ్యాస్ సరఫరాలకు ఏళ్ల తరబడి అంతరాయం కలిగిస్తామని హెచ్చరించింది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరోసారి ఇరాన్‌కు తీవ్ర హెచ్చరికలు చేశారు. ఇరాన్ నాగరికత మొత్తం నేటి రాత్రితో అంతమైపోతుందని అన్నారు. దానిని మళ్లీ ఎప్పటికీ పునరుద్ధరించలేరని 'ట్రూత్ సోషల్' వేదికగా పోస్టు పెట్టారు. ఇరాన్‌లో 47 ఏళ్లుగా ఉన్న అవినీతి, అరాచక పాలన అంతం కానుందని.. ప్రపంచ చరిత్రలో ఈ రాత్రి ఓ మైలురాయిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు. ఆ దేశాన్ని తుడిచిపెట్టడం నిజానికి తనకు ఇష్టం లేదని.. కానీ ఆ విధంగా చేయక తప్పట్లేదని పేర్కొన్నారు. అయితే, ఇరాన్‌లో కొత్త, తెలివైన నాయకత్వం వచ్చిందని, దాని వల్ల అద్భుతాలు జరిగే అవకాశం కూడా ఉందన్నారు.మరికొన్ని గంటల్లో ఇరాన్ హర్మూజ్‌ను తెరవకపోతే ఆ దేశంలోని ఇరాన్‌లో వంతెనలు, విద్యుత్ కేంద్రాలను లక్ష్యం చేసుకుంటామని సోమవారం ట్రంప్ హెచ్చరించిన విషయం తెలిసిందే. అయినప్పటికీ అమెరికా ప్రతిపాదనలను ఇరాన్ తిరస్కరించడంతో.. ట్రంప్ తాజాగా మరోసారి హెచ్చరికలు చేశారు. ఇరాన్‌లోని పౌర, మౌలిక సదుపాయాలపై దాడులు చేస్తే.. అంతర్జాతీయ నేరంగా పరిగణిస్తామని ఐక్యరాజ్య సమితి చీఫ్ ఆంటోనియో గుటెరస్ హెచ్చరించినప్పటికీ అమెరికా దాడులు కొనసాగిస్తోంది.ఇరాన్‌లోని ఖర్గ్ ఐలాండ్ లో ఉన్న దాదాపు 50 లక్ష్యాలపై తమ దళాలు దాడులు జరిపినట్లు అమెరికా వెల్లడించింది. అక్కడి రక్షణ వ్యవస్థలపై కూడా దాడులు చేసినట్లు తెలిపింది. ఈ ద్వీపాన్ని స్వాధీనం చేసుకోవడానికి మెరైన్‌లతో ఆపరేషన్ చేపట్టడానికి అగ్రరాజ్యం యోచిస్తున్నట్లు సమాచారం. ఇరాన్‌లోని పలు ప్రాంతాల్లోనూ అమెరికా-ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతున్నాయి. ట్రంప్ వ్యాఖ్యలపై ఇరాన్ స్పందించింది. ఈ రాత్రికి ఇరాన్ నాగరికత తుడిచి పెట్టుకోబోతోందంటూ ట్రంప్ చేసిన వ్యాఖ్యలను తిప్పికొట్టింది. అమెరికా, దాని మిత్రదేశాలే పురాతన నాగరికత కలిగిన ఇరాన్ నుంచి మరిచిపోలేని దెబ్బను రుచి చూస్తారంటూ పేర్కొంది. ఈ మేరకు దక్షిణ ఆఫ్రికాలోని ఇరాన్ ఎంబసీ ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టింది.

## ఏసీబీ వలలో వ్యవసాయ అసోసియేటెడ్ డీన్

మొదటిపేజీ తరువాయి..

డిమాండ్ చేసినట్లు వెల్లడైంది. ముందుగా రూ.25 వేల లంచం స్వీకరించిన గోవర్ధన్, అనంతరం మరో రూ.1 లక్ష ఇవ్వాలని ఒత్తిడి తెచ్చినట్లు బాధితుడు తెలిపాడు. దీంతో బాధితుడు ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేయగా వారు పథకం రచించారు. మంగళవారం బాధితుడు గోవర్ధన్‌కు డబ్బు




ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం అధికారులు ఎల్బీనగర్‌లోని గోవర్ధన్ నివాసంలో సోదాలు నిర్వహించి కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. విచారణ అనంతరం గోవర్ధన్‌ను ఏసీబీ కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి ఆయనకు 14 రోజుల జుడీషియల్ రిమాండ్ విధించారు. దీంతో గోవర్ధన్‌ను చంచల్‌గూడ జైలుకు తరలించారు. ఈ సందర్భంగా ఏసీబీ డైరెక్టర్ జనరల్ చారుసిన్హా మాట్లాడుతూ, ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1064కు సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు.

## కరువు కోరలు

మొదటిపేజీ తరువాయి..

భూమిపై ఉష్ణోగ్రతలు మునుపెన్నడూ లేని విధంగా పెరగవచ్చని అంతర్జాతీయ వాతావరణ సంస్థలు హెచ్చరిస్తున్నాయి. ఇది కేవలం పసిఫిక్ మహాసముద్రానికే పరిమితం కాకుండా, ప్రపంచవ్యాప్త ఆహార భద్రత, ఆర్థిక వ్యవస్థలపై తీవ్ర ప్రభావం చూపనుంది. ఈనాడు కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.అసలు 'ఎల్ నినో' అంటే ఏమిటి?: పసిఫిక్ మహాసముద్రంలోని ఉపరితల జలాలు అసాధారణంగా వేడెక్కడాని 'ఎల్ నినో' అని పిలుస్తారు. సాధారణంగా సముద్రపు నీటి ఉష్ణోగ్రత సగటు కంటే 0.5ిజ నుంచి 1.5ిజ పెరిగితే దానిని సాధారణ ఎల్ నినోగా పరిగణిస్తారు. అయితే, ఈ ఉష్ణోగ్రత పెరుగుదల 2.5ిజ లేదా అంతకంటే ఎక్కువ నమోదైతే దానిని 'సూపర్ ఎల్ నినో'గా పిలుస్తారు. గతంలో 1982-83, 1997-98 మరియు 2015-16 సంవత్సరాల్లో ఇటువంటి పరిస్థితులు తలెత్తి ప్రపంచాన్ని వణికించాయి. యూరోపియన్ సెంటర్ ఫర్ మీడియం రేంజ్ వెదర్ ఫోర్ కాస్ట్ అంచనాల ప్రకారం, ఈ ఏడాది జూన్ నుంచే ఎల్ నినో పరిస్థితులు ప్రారంభం కానున్నాయి. ఆగస్టు నాటికి ఇది మరింత బలపడి 'సూపర్ ఎల్ నినో'గా మారే అవకాశం 22 శాతం ఉండగా, 'స్ట్రాంగ్ ఎల్ నినో' ఏర్పడేందుకు 80 శాతం అవకాశాలు ఉన్నాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. రాబోయే కాలం గత వందేళ్లలోనే అత్యంత వేడి సంవత్సరంగా నమోదయ్యే ప్రమాదం ఉందని వాషింగ్టన్ వాతావరణ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. భారత్‌పై ప్రభావం.. రుతుపవనాలకు విఘాతం: భారతదేశం వంటి వ్యవసాయ ఆధారిత దేశాలకు ఎల్ నినో ఒక గండం లాంటిది. పసిఫిక్ సముద్రం వేడెక్కినప్పుడు, అది భారత ఉపఖండం వైపు వచ్చే రుతుపవనాల గమనాన్ని దెబ్బతీస్తుంది. దీనివల్ల దేశంలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదవుతుంది. ముఖ్యంగా మధ్య మరియు ఉత్తర భారతదేశంలో కరువు పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉంది. వర్షాలు లేక పంటలు ఎండిపోవడం వల్ల ఆహార ధాన్యాల ఉత్పత్తి తగ్గి, ధరలు ఆకాశాన్ని తాకవచ్చు. ఎల్ నినో ప్రభావంతో మే, జూన్ నెలల్లోనే కాకుండా, వర్షాకాలంలో కూడా తీవ్రమైన ఎండలు, వడగాల్పులు వీచే ప్రమాదం ఉంది.సూపర్ ఎల్ నినో కేవలం భారత్‌నే కాదు, ప్రపంచం మొత్తాన్ని ప్రభావితం చేస్తుంది. ఆస్ట్రేలియా, ఇండోనేషియా, ఫిలిప్పీన్స్, మధ్య ఆఫ్రికా దేశాల్లో తీవ్ర కరువు ఏర్పడవచ్చు. మరోవైపు, దక్షిణ అమెరికాలోని కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు, వరదలు సంభవించే అవకాశం ఉంది. అట్లాంటిక్ మహాసముద్రంలో హరికేన్ల ఉధృతి తగ్గినప్పటికీ, పసిఫిక్ ప్రాంతంలో తుపానులు మరింత తీవ్రం కావచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అప్రమత్తతే ముఖ్యం: వాతావరణ నమూనాలన్నీ ప్రమాద ఘంటికలను మోగిస్తున్నాయి. పెరుగుతున్న ఉష్ణోగ్రతలను తట్టుకోవడానికి, సాగునీటి నిర్వహణలో జాగ్రత్తలు తీసుకోవడానికి ప్రభుత్వం మరియు ప్రజలు ఇప్పటి నుంచే సిద్ధం కావాలి. సముద్రం వేడెక్కడం అనేది కేవలం ప్రకృతి మార్పు మాత్రమే కాదు, అది మన జీవనశైలిని, ఆర్థిక వ్యవస్థను అతలాకుతలం చేసే అస్త్రం. కాబట్టి, ముందస్తు ప్రణాళికలతో ఈ 'సూపర్ ఎల్ నినో' గండాన్ని అధిగమించడం అత్యవసరం.

## ఆ రాష్ట్రాల్లో రేపే ఎన్నికలు

జరుగుతుండగా.. తమిళనాడులో ఏప్రిల్ 23న జరగనున్నాయి. ఇక పశ్చిమ బెంగాల్‌లో అయితే రెండు విడతలుగా 23తో పాటు 29న రెండు విడతల్లో ఓటింగ్ జరుగుతోంది. తొలి విడత ఏప్రిల్ 23న జరుగుతుండగా.. రెండో విడత పోలింగ్ మాత్రం ఏప్రిల్ 29న జరుగుతోంది. ఇక ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు మాత్రం మే 4న విడుదలకానున్నాయి. ఇక ఎగ్జిట్ పోల్స్ మాత్రం ఏప్రిల్ 29న సాయంత్రం 6 గంటలకు వెలువడనున్నాయి. అన్ని పార్టీలు నువ్వానేనా? అన్నట్టుగా ఫైటింగ్ చేస్తున్నాయి. కేరళలో వరుసగా మూడోసారి పినరయి విజయన్ ఆధ్వర్యంలో ఎల్డీఎఫ్ వామపక్షాలు అధికారంలోకి రావాలని ప్రయత్నిస్తున్నాయి. దేశంలో సీపీఎం అధికారంలో ఉన్న ఏకైక రాష్ట్రం ఇదే కావడం గమనార్హం. అటు కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ ఈ సారి ఖచ్చితంగా గెలిచి దేశంలో మరో రాష్ట్రంలో పాగా వేయాలని ప్రయత్నిస్తోంది. అటు బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమి గట్టి పోటీ ఇస్తుంది. అస్సాంలో మూడోసారి హిమంత బిశ్వశర్మ ఆధ్వర్యంలో మూడోసారి అధికారంలోకి రావాలని ప్రయత్నిస్తోంది. అటు కాంగ్రెస్ కూడా ఈ సారైనా అసెంబ్లీ ఎన్నికల్లో గెలవాలని తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. అటు కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలో ఎన్డీయే, ఇండియా కూటమిలు పోటీ పడుతున్నాయి. మొత్తంగా ఈ ఎన్నికల్లో ఓటర్లు ఎవరిని రాజు చేస్తారో.. ఎవరిని బంటు చేస్తారో తెలియాలంటే మే 4 ఎన్నికల కౌంటింగ్ వరకు వెయిట్ చేయాల్సిందే.

## ఆ 3 రోజులు మహిళల్ని..

మొదటిపేజీ తరువాయి..

సంప్రదాయాలకు అనుగుణంగా శతాబ్దాలుగా భక్తులు స్వామిని పూజిస్తున్నారని కేంద్రం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వెల్లడించారు. శబరిమల ఆలయంలో మహిళల ప్రవేశానికి సంబంధించి గతంలో వెలువడిన తీర్పును మంగళవారం జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని 9 మంది జడ్జీల ధర్మాసనం సమీక్షిస్తోంది. ఈమేరకు పిటిషన్‌దారుల వాదనలు వింటోంది. దీనికి ముందు కేంద్రం తన వివరణను సమర్పించింది. ఈ అంశం పూర్తిగా మత విశ్వాసాలకు సంబంధించినదని పేర్కొన్నారు. న్యాయసమీక్షకు అతీతమైందని వాదించారు. శబరిమల ఆలయంలో మహిళల ప్రవేశానికి సంబంధించి ఉన్న ఆంక్షలు కొనసాగించాలని సుప్రీంకోర్టును కోరారు. శబరిమల అయ్యప్ప ఆలయంలోకి 10-50 ఏళ్ల వయసున్న మహిళల ప్రవేశంపై నిషేధాన్ని రద్దు చేస్తూ 2018లో సుప్రీంకోర్టు చరిత్రాత్మక తీర్పు ఇచ్చింది. అయితే ఈ తీర్పుపై పలు రివ్యూ పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ క్రమంలోనే 9 మంది సభ్యుల విస్తృత ధర్మాసనం ఈ కేసును విచారిస్తోంది. శబరిమల ఆలయంలో మహిళల ఎంట్రీ అంశంపై ఇవాళ సుప్రీంకోర్టులో విచారణ జరుగుతున్నది. 9 మంది సభ్యుల ధర్మాసనం విభిన్న కోణాల్లో ఈ అంశాన్ని విచారిస్తున్నది. సుప్రీం ధర్మాసనంలో సీజేఐ సూర్యకాంత్‌తో పాటు జస్టిస్ బీవీ నాగరత్న, ఎంఎం సుందరేశ్, అషానుద్దీన్ అమానుల్లా, అరవింద్ కుమార్, ఆగస్టిన్ జార్జ్ మాసి, ప్రసన్న బి వర్లే, ఆర్ మహాదేవన్, జోయ్‌మాల్యా బాగ్చీ ఉన్నారు. 10 నుంచి 50 ఏళ్ల వయసున్న మహిళలకు శబరిమల ఆలయంలోకి ప్రవేశం లేదన్న అంశంతో పాటు మరికొన్ని అంశాలను సుప్రీంకోర్టు పరిశీలిస్తున్నది. అయితే సుప్రీం ధర్మాసనం ముందు కేంద్ర ప్రభుత్వం తన వైఖరిని స్పష్టం చేసింది. కేరళలోని శబరిమల ఆలయంలోకి మహిళల ప్రవేశం విషయంలో ఉన్న నిబంధనలను కేంద్ర ప్రభుత్వ సమర్థించింది. అయితే ఆ అంశం మత విశ్వాసాలకు చెందుతుందని, మతం పరిధిలోకి వస్తుందని, జుడిషియల్ పరిధిలోకి ఇది రాదని ప్రభుత్వం చెప్పింది. కేంద్రం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తన వాదనలు వినిపించారు. ఏదైనా అశాస్త్రీయ విధానం ఉంటే, దాన్ని శాసనాల ద్వారా పరిష్కరించుకోవచ్చు అన్నారు. ప్రతి మతపరమైన విధానాన్ని గౌరవించాలని, ప్రతి అంశాన్ని హుందాతనానికి, శరీర స్వేచ్ఛకు ఆపాదించలేమన్నారు. మసీదుకు వెళ్లినా, గురుద్వారకు వెళ్లినా.. ముఖాన్ని కప్పుకోవాల్సి వస్తుందని, అప్పుడు నా గౌరవాన్ని, హక్కును లాక్కున్నారని అనలేమని తుషార్ మెహతా చెప్పారు. మతపరమైన స్వేచ్ఛను రాజ్యాంగం రక్షిస్తుందన్నారు.

సమగ్ర తెలుగు దినపత్రిక
అడుగు
The Step Towords The Truth..

## కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి

పాలకుర్తి, ఏప్రిల్ 7 (అడుగు న్యూస్):
జనగామ జిల్లా, పాలకుర్తి మండలం, గూడూరు గ్రామంలో మార్క్‌ఫెడ్ ద్వారా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని వెంటనే ప్రారంభించాలని రైతులు రాస్తారోకో నిర్వహించి నిరసన తెలిపారు. తెలంగాణ రైతు



సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మాచర్ల సారయ్య మాట్లాడుతూ క్లస్టర్‌లో 20 ఎకరాల్లో పంట సాగు అయినప్పటికీ కేంద్రం లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. మద్దతు ధర రూ.2400 ఉండగా ప్రైవేట్ వ్యాపారులు రూ.1900కే కొనుగోలు చేస్తుండటంతో రైతులకు నష్టం జరుగుతోందన్నారు. వెంటనే కేంద్రం ఏర్పాటు చేయాలని, లేనిపక్షంలో ఆందోళనలు తీవ్రం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## గాంధీ సర్కిల్ అభివృద్ధికి శ్రీకారం

కళ్యాణదుర్గం, ఏప్రిల్ 7 (అడుగు న్యూస్):
కళ్యాణదుర్గం పట్టణ అభివృద్ధికి ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు నడుం బిగించారు. ఇప్పటికే భక్త కనకదాసు, వాల్మీకి సర్కిళ్లను స్వంత నిధులతో అభివృద్ధి చేస్తుండగా, తాజాగా ప్రధాన కూడలి గాంధీ సర్కిల్ పనులకు శ్రీకారం చుట్టారు. మహాత్మా గాంధీ విగ్రహం స్థానంలో నూతన విగ్రహంతో పాటు పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నారు. సర్కిల్‌ను ఆధునికంగా, సౌకర్యవంతంగా తీర్చిదిద్దే పనులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ నాయకులు, ఆర్యవైశ్య సంఘ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి అభివృద్ధి పనులను ప్రారంభించారు. దీంతో పట్టణ రూపురేఖలు మారనున్నాయి.

## కృతజ్ఞతలు

తొర్రూరు, ఏప్రిల్ 7 (అడుగు న్యూస్):
మహబూబాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యవర్గంలో అవకాశం కల్పించినందుకు టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సీ రెడ్డిని జిల్లా కాంగ్రెస్



కార్యదర్శి దంతలపల్లి రవి, ఎగ్జిక్యూటివ్ మెంబర్ సంకేపల్లి రవీందర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కట్టుబడి పనిచేస్తామని తెలిపారు. ఎమ్మెల్యే నాయకత్వంలో ప్రజలకు న్యాయం జరిగేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. పార్టీ అభివృద్ధి కోసం సమిష్టిగా పనిచేసి కార్యకర్తల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటామని పేర్కొన్నారు.

## తాగునీటి సమస్యకు పరిష్కారం

పాలకుర్తి, ఏప్రిల్ 7 (అడుగు న్యూస్):
జనగామ జిల్లా, పాలకుర్తి పట్టణ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తొలగించేందుకు ఇసుక దేవిబాయి వద్ద కొత్తగా బోరు మోటార్‌ను ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ కమ్మగాని విజయ నాగన్న తెలిపారు. ఇటీవల తాగునీటి కొరతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనడంతో శాశ్వత పరిష్కారంగా ఈ చర్య తీసుకున్నామని చెప్పారు. ఈ బోరు ద్వారా నిరంతరంగా శుద్ధమైన తాగునీరు అందుబాటులోకి వస్తుందని



పేర్కొన్నారు. కార్యక్రమాన్ని కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గాదెపాక కిరణ్, పంచాయతీ కార్యదర్శి రూబీన, వార్డు సభ్యులు మామిండ్ల కవిత శోభన్ బాబు, కమ్మగాని సుధాకర్, జలగం మమత నరేష్, నెమరుగొమ్ముల శ్రీనివాసరావు, కమ్మగాని శ్రీకాంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధికి ఎమ్మెల్యేకు వినతి

భువనగిరి, ఏప్రిల్ 7 (అడుగు న్యూస్):
హైదరాబాద్‌లో స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డిని



భువనగిరి మున్సిపాలిటీ 22వ వార్డు కౌన్సిలర్ జాలిగం విఘ్నేష్ కలిసి అభివృద్ధి పనులపై వినతిపత్రం అందజేశారు. వార్డు పరిధిలో 300 మీటర్ల అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం, కొన్ని ప్రాంతాల్లో సీసీ రోడ్ల మంజూరు చేయాలని కోరారు. ప్రజలకు మౌలిక సదుపాయాలు మెరుగుపడేలా ఈ పనులు అత్యవసరమని వివరించారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారులకు వెంటనే సిఫారసు చేస్తానని హామీ ఇచ్చారు. అభివృద్ధి విషయంలో రాజీపడకుండా ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ఎప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.

# మోదీ.. పినరయ్ గాడ్ ఫాదర్!



మొదటిపేజీ తరువాయి..

కేరళంలోనే విషాద స్టోరీలకు యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్ ప్రభుత్వం చరమాంకం పలుకుందన్నారు. యూడీఎఫ్ గవర్నమెంట్ వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. పినరయి విజయన్ అంటే తనకు గౌరవమని.. కానీ ఆయన ప్రభుత్వం అంటే తనకు నచ్చదన్నారు. ఊమెన్ చాండీ కరుణాకరన్ ఆధ్వర్యంలో కేరళ అభివృద్ధి చెందిందన్నారు. కేరళంకు పినరయి విజయన్, మోడీలు వద్దు. పినరయి విజయన్ జ్యోతి బసు, సోమనాథ్ చటర్జీలను మరచిపోయి చాలా కాలం అయ్యింది. ఎన్డీఏ తరపున పినరయి విజయన్ కేరళంలో పని చేస్తున్నారు. కేరళంలో ప్రతి సమస్యకు కారణం పినరయి విజయన్. గత పదేళ్లుగా పినరయి విజయన్ కాకుండా మరో వామపక్ష నేత లీడర్‌గా లేరు. 2023కు ముందు తెలంగాణను తాను తప్ప ఎవరు నడిపించ లేరు అని పినరయి విజయన్ స్నేహితుడు కేసీఆర్ అనుకున్నారు. కానీ కాంగ్రెస్ వచ్చి తెలంగాణలో అభివృద్ధి చేస్తోంది. కేరళంలో యూడీఎఫ్ వచ్చి పినరయి విజయన్ కోటను బద్దలు కొడుతుంది. మోడీ పినరయి విజయన్ పేరుతో కేరళంలోకి ఎంటర్ అవుతున్నారు. మోడీ, పినరయి విజయన్ ఇద్దరూ బ్రదర్స్. కేరళంలో పినరయి, ఢిల్లీలో మోడీ మంచి మిత్రులని సీఎం రేవంత్ విమర్శలు గుప్పించారు. తనతో చర్చకు రావాలన్న సీఎం రేవంత్‌రెడ్డి సవాల్‌పై కేరళం ముఖ్యమంత్రి పినరయి విజయన్ తిప్పికొట్టారు. ఆయనతో చర్చకు దిగే ఉద్దేశం తనకు లేదన్నారు. రేవంత్‌తో చర్చకు దిగేందుకు తెలంగాణలో పార్టీలు ఉన్నాయని, ఆయన ప్రభుత్వ పనితీరుపై అక్కడి ప్రజలే తీర్పునివ్వాలని వ్యాఖ్యానించారు. తమ పార్టీ నేతలు అక్కడ రేవంత్ వ్యవహారంపై మాట్లాడుతారని అన్నారు. నీతి ఆయోగ్ 2023-24 సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సూచీలో కేరళ తొలి స్థానంలో ఉందని పినరయి విజయన్ అంటున్నారని, ఇది కేరళలో ఏడు దశాబ్దాల ప్రభుత్వాలన్నింటి కృషి అని సోమవారం సీఎం రేవంత్ పేర్కొన్న సంగతి తెలిసిందే. అందులో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ కూడా ఉందని గుర్తించాలన్నారు. అందరి కష్టాన్నీ సొంత ఖాతాలో వేసుకోవడం సరికాదని హితవు పలికారు. ఈ అంశంపై చర్చించేందుకు సిద్ధంగా ఉన్నానని, చర్చకు రావాలని పినరయి విజయన్‌కు సవాల్ విసిరారు. తెలంగాణ ప్రభుత్వ పనితీరును విమర్శిస్తూ కేరళ సీఎం పినరయి విజయన్ రాసిన లేఖపై సీఎం రేవంత్‌రెడ్డి మరోసారి స్పందించారు. కేరళ ప్రభుత్వ పనితీరుపై తన విమర్శలను ఎంతో గౌరవప్రదంగా, హుందాగా వ్యక్తం చేశానని అన్నారు. విజయన్ మాత్రం తక్కువ స్థాయి భాషను ఉపయోగించాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు. ‘ మీ అసహనపూరిత వ్యాఖ్యలకు నేను అదే రీతిలో స్పందించను. మీరు నా రాష్ట్రానికి వచ్చినప్పుడు, ఒక అతిథికి చేయాల్సిన అన్ని మర్యాదలు చేస్తానని మాట ఇస్తున్నా. ప్రస్తుత తెలంగాణ పరిస్థితికి మీరు నీతి ఆయోగ్ ఎస్డీజీ ఇండెక్స్ 2023-24ని ప్రామాణికంగా చూపిస్తున్నారు. ఆ సూచీ డిసెంబర్ 2023తో ముగిసిన బీఆర్ఎస్ పదేళ్ల దుష్పరిపాలనను ప్రతిబింబిస్తుంది. మా ప్రభుత్వం 28 నెలలు పూర్తి చేసుకుంది. 2024-25లో తెలంగాణ జీఎస్డీపీ రూ.16.12 లక్షల కోట్లుగా ఉండి.. 10.7 శాతం వృద్ధిని నమోదు చేసింది. ఇది జాతీయ సగటు 9.9 శాతం కంటే ఎక్కువ. కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, కేరళలను అధిగమించి భారత్‌లోనే అత్యధిక తలసరి ఆదాయం ఉన్న రాష్ట్రంగా తెలంగాణ నిలిచింది. కేరళ ప్రజలకు మీ హయాంలో ఏం జరిగిందో చూపించండి‘ అని ఎక్స్‌లో పేర్కొన్నారు.

# హరీశ్ అరెస్ట్



మొదటిపేజీ తరువాయి..

అప్పా జంక్షన్ వద్ద హరీశ్‌రావు కాన్వాయ్‌ను పోలీసులు నిలిపివేయడంతో ఉద్రిక్తత నెలకొంది. బీఆర్ఎస్ నేతలు, పోలీసుల మధ్య వాగ్వాదం చోటుచేసుకోగా, కార్యకర్తలు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం హరీశ్‌రావుతో పాటు మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావులను శంషాబాద్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

ఇదిలా ఉండగా, కేటీఆర్ సహా పలువురు బీఆర్ఎస్ నేతలు అరెస్టులను తీవ్రంగా ఖండించారు. పరిశ్రమల పేరుతో రైతుల భూములను లాక్కోవడం దుర్మార్గమని, ప్రభుత్వం ఇచ్చిన హామీలను విస్మరించిందని విమర్శించారు. రైతుల పక్షాన పోరాటం కొనసాగుతుందని, అక్రమ అరెస్టులను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

## ఎరుపెక్కిన కర్రె గుట్టల్లో.. శాంతి గీతం!

మొదటిపేజీ తరువాయి..

మోతతో, అశాంతితో నిండిన తెలంగాణ అటవీ ప్రాంతాల్లో ఇప్పుడు శాంతి గీతం వినిపిస్తోంది. దశాబ్దాల కాలంగా మావోయిస్టులకు అడ్డాగా ఉన్న ప్రాంతాల్లో ఇప్పుడు అభివృద్ధి పరుగులు తీస్తోంది. తెలంగాణలో మావోయిజం పూర్తిగా అంతరించిందని రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి అధికారికంగా ప్రకటించారు. 'ఫేస్ టు ఫేస్' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, కర్రెగుట్టల వంటి మారుమూల ప్రాంతాల్లో మారుతున్న పరిస్థితులను వివరించారు. ఒకప్పుడు దట్టమైన అడవుల్లో సమాంతర ప్రభుత్వాన్ని నడిపిన మావోయిస్టుల ఉనికి ఇప్పుడు తెలంగాణలో లేదని డీజీపీ స్పష్టం చేశారు. ఆపరేషన్ కగార్ విజయవంతం కావడంతో పాటు, కీలక నాయకత్వం , సైన్యాధ్యక్షులు సైతం బయటకు రావడంతో ఆ వ్యవస్థ పూర్తిగా కొలాప్స్ అయిందని ఆయన పేర్కొన్నారు.

ఇప్పుడు ఈ ప్రాంతాలు నక్సల్ రహిత జోన్లుగా మారాయని, ప్రజలు స్వేచ్ఛగా తిరుగుతున్నారని తెలిపారు. గతంలో కనీస సౌకర్యాలు లేకపోవడమే నక్సలిజం పెరగడానికి ప్రధాన కారణమని గుర్తించిన ప్రభుత్వం, ఇప్పుడు ఆ లోటును భర్తీ చేస్తోంది. బాహ్య ప్రపంచంతో సంబంధం లేని కర్రెగుట్టల వంటి ప్రాంతాలకు ఇప్పుడు బిటి రోడ్ల నిర్మాణం జరుగుతోంది. దీనివల్ల ఆదివాసీలకు రవాణా సౌకర్యం మెరుగుపడింది. అత్యవసర సమయాల్లో ఆసుపత్రికి వెళ్లడానికి గ్రామస్తుల కోసం ప్రభుత్వం ఒక ఆటో , టూ వీలర్‌ను కమ్యూనిటీ వాహనాలుగా అందజేసింది. గతంలో 12-13 కిలోమీటర్లు కాలినడకన వెళ్లాల్సిన దుస్థితి ఇప్పుడు తొలగిపోయింది. ఇప్పటికీ విద్యుత్ సౌకర్యం లేని మారుమూల ఇళ్లకు సోలార్ కందిళ్లను పంపిణీ చేయడం ద్వారా ప్రభుత్వం చీకట్లను తొలగిస్తోంది. కనీసం ఆధార్ కార్డులు, ఓటు హక్కు వంటి కనీస గుర్తింపు కూడా లేని ఆదివాసీలకు ఇప్పుడు అన్ని ప్రభుత్వ ఫలాలను అందించడమే లక్ష్యంగా పోలీస్ బాస్ స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ ప్రాంతాలను పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దే అవకాశం ఉందని, అటవీ వనరులను కాపాడుకుంటూనే అభివృద్ధిని ముందుకు తీసుకెళ్తామని డీజీపీ భరోసా ఇచ్చారు. తుపాకీ గొట్టం ద్వారా కాకుండా, అభివృద్ధి ద్వారానే మార్పు సాధ్యమని తెలంగాణ ప్రభుత్వం నిరూపిస్తోంది. కర్రెగుట్టల వంటి ప్రాంతాల్లో వేసిన రోడ్లు కేవలం రవాణా కోసమే కాదు, ఆ ప్రజల ఉజ్వల భవిష్యత్తు కోసం వేసిన బాటలు అని చెప్పవచ్చున్నారు.

# ఈ ఏట వానలు అంతంతే!

## వాతావరణ సంస్థ స్కైమెట్ వెల్లడి

న్యూఢిల్లీ,ఏప్రిల్7(అడుగు న్యూస్):
భారత్‌లో ఈ ఏడాది వర్షాకాలంలో సాధారణ కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంది. నైరుతి రుతుపవనాలు కొనసాగే వర్షాకాలం రెండో భాగమైన జూన్-సెప్టెంబర్‌లో ఎల్ నినో ప్రభావం వల్ల వర్షాలు తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని ప్రైవేటు వాతావరణ సంస్థ స్కైమెట్ వెల్లడించింది. నైరుతి రుతుపవనాల కాలంలో దీర్ఘకాలిక వర్షపాతం సగటున 868.6 మిల్లీమీటర్లు కాగా, అందులో 94 శాతం వర్షాలు మాత్రమే పడే అవకాశాలున్నాయని తెలిపింది. 2026 వర్షాకాలం సీజన్‌లో నమోదయ్యే వర్షపాతం అంచనాలను భారత వాతావరణ శాఖ వచ్చే వారంలో విడుదల చేయనుంది. భారత్‌లో ఏడాదిలో నమోదయ్యే వర్షపాతంలో దాదాపు 70 శాతం వరకూ నైరుతి రుతుపవనాల వల్లే సాధ్యమవుతుంటుంది. నైరుతి రుతుపవనాలు జూన్ నుంచి సెప్టెంబర్ వరకూ వరి, పత్తి, చెరుకు సహా ఖరీఫ్ పంటల సాగుకు కీలకమవుతాయి. సాధారణంగా జూన్ 1 లేదా మొదటి వారంలో కేరళను రుతుపవనాలు తాకి, జూలై 15 నాటికి ఉత్తరాది సహా దేశమంతటా విస్తరిస్తాయి. కాగా, అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకూ వచ్చే ఈశాన్య రుతుపవనాలు స్వల్పకాలికమే అయినా ఆగ్నేయ భారతదేశానికి, ముఖ్యంగా తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాలకు ఈ వర్షాలు కీలకం. శీతాకాలంలో మధ్యధరా ప్రాంతం నుంచి వచ్చే



అల్పపీడన వ్యవస్థల కారణంగా తేలిక పాటి నుంచి భారీ వర్షాలు, మంచు కురియడానికి కారణమవుతుంటాయి. అయితే ఈ వర్షాలు ఉత్తరభారతదేశంలో కీలకమైన రబీ పంటలు, ముఖ్యంగా గోధుమలకు చాలా ఉపయోగకరం.




## మడ్డి పట్టిన నూనె మంచిగైతది!?

ఒకప్పుడు కాపిష్కెడు నూనె పోసి కిల కూర ఒండాల్నంటే గగనమయ్యేది. ఉప్పు, కారం, మసాల, ఇంత నూనె యేసి కలిపి పొయ్యి మీద పెడితే ఒంటయ్యేది. కూర గూడ కమ్మగుండేది. కిల నూనె నెల రోజులయ్యేది. గిప్పుడైతే నెల రోజుల నూనె ఒక్క రోజుకు సరిపోతలేదు. ఇగిప్పుడైతే అన్నీ యేంపుడ్లేనాయె. కూరల్ల కిలోల కొద్దీ నూనె తేలుతాండె. మల్ల మెరపకాయ బజ్జీలు, చికెన్, మటన్ పకోడిలు... ఇగ సెప్పుకుంట పోతే శాంతాడంత ఉంటది. ఇగ గియన్నీ శేసినంక గా నూనె ఎట్లయితది? నల్లగ మడ్డి పడతది. మరి గా మడ్డిని తీయాల్నంటే ఏం శేయాలె?



చాయె ఒడబోసే జాలి తీస్కోవాలె. గింత పత్తిని తీస్కాని, గదాన్ని గా జాలిల పరిసినట్లు పెట్టాలె. ఇగ మడ్డిపట్టిన నూనెను త జాలితోటి ఒడబోయాలె. గంతె. నల్లటి మడ్డి గా దూదిలనే ఆగుతది. గా నూనె ఎప్పటి లెక్కనే తెల్లగైతది. ఇగ గిట్ల తింటే, క్యాన్సర్లు లాంటి రోగాలు రావన్నట్లు?

## వలస కార్మికులకు 5కిలోల సిలిండర్లు

మొదటిపేజీ తరువాయి..

చేయాలని సూచించారు. ఎల్‌పిజి గ్యాస్ కొరత వల్ల దేశంలో ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. వలస కార్మికుల సంగతి సరేసరి. ఈ నేపథ్యంలో వలస కార్మికులని దృష్టిలో ఉంచుకుని రోజుకి 5 కేజీల గ్యాస్ సిలిండర్ అడ్రస్ ప్రూఫ్ లేకుండా.. ఏదైనా ప్రభుత్వ గుర్తింపు కార్డు చూపించి కొనుగోలు చేయవచ్చని ఇటీవల కేంద్రం ప్రకటించింది. ఐదు కేజీల గ్యాస్ సిలిండర్ సమీపంలో ఎల్‌పిజి డిస్ట్రిబ్యూటర్ల దగ్గర అందుబాటులో ఉంటుందని పెట్రోలియం శాఖ తెలిపింది. తాజాగా మంగళవారం వలసకార్మికులకు ఇచ్చే గ్యాస్ సిలిండర్ల సంఖ్యను కేంద్రం డబుల్‌కి పెంచింది. అంటే వలస కార్మికులు రోజుకి రెండు ఐదు కేజీల ఎల్‌పిజి సిలిండర్లను కొనుగోలు చేసేందుకు మంత్రిత్వశాఖ వీలు కల్పించింది. ఈ మేరకు అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ప్రధాన కార్యదర్శులకు మంత్రిత్వశాఖ లేఖ రాసింది. మార్చి 21వ తేదీన రాష్ట్రాల చీఫ్‌లకు రాసిన లేఖలో వలస కార్మికులకు ఐదు కేజీ సిలిండర్‌లను ఓఎంసి (ఆయిల్ మార్కెటింగ్ కంపెనీస్)ల సహాయంతో ఇవ్వాలని లేఖ రాసింది. అయితే ఈ లేఖలో రాసిన దానికంటే 20 శాతం పరిమితికి మించి పెంచడం జరిగిందని, వలస కార్మికులకు సిలిండర్లను అందుబాటులో ఉంచాలని పెట్రోలియం శాఖ తాజాగా రాష్ట్రాలకు రాసిన లేఖలో పేర్కొంది.

## స్టేకు ఎన్జీటీ నిరాకరణ

మొదటిపేజీ తరువాయి..

దాదాపు 30 వేల ఎకరాల్లో టౌన్‌షిప్ ప్రాజెక్టును చేపట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందని, వీటిపై స్టే ఇవ్వాలని కోరుతూ హైదరాబాద్ కొంపల్లికి చెందిన డాక్టర్ దొంతి నర్సింహారెడ్డి ఎన్జీటీలో పిటిషన్ దాఖలు చేశారు. పర్యావరణ అనుమతులులేని ఈ చర్యలు చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అదనపు అడ్వకేట్ జనరల్ తేరా రజినీకాంత్‌రెడ్డి వాదిస్తూ.. ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టు ఇంకా ప్రారంభదశలోనే ఉందని, ఇప్పటివరకు ఇంకా ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించలేదని పేర్కొన్నారు. చట్టవిరుద్ధంగా పనులు చేపట్టబోమని, సరైన సమయంలో పర్యావరణం సహా అన్ని అనుమతులు తీసుకుంటామని తెలిపారు. వాదనలు విన్న ధర్మాసనం.. ప్రాజెక్టు ఇంకా ప్రారంభదశలోనే ఉన్నందున అనుమతులు తీసుకోరని ఎందుకు అనుకోవాలని ప్రశ్నిస్తూ.. స్టే ఇవ్వడానికి నిరాకరించింది. వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీచేసింది. తదుపరి విచారణ జూన్ 9కి వాయిదాపడింది.

## ‘మామ’ నుంచి భూమి!

చంద్రుడిపై వెలుతురు, చీకటిని వేరు చేసే ‘టెర్మినేటర్’ లైన్ అత్యంత ఆకర్షణీయంగా ఉందని చెప్పారు. సుమారు 50 ఏళ్ల తర్వాత చంద్రుడి వెనుక భాగాన్ని మానవులు నేరుగా చూడటం ఇదే మొదటిసారి. ఈ చారిత్రాత్మక యాత్ర భవిష్యత్తులో చంద్రుడిపై మనుషులు దిగడానికి బలమైన పునాది వేయబోతోంది. చందమామ ఉపరితలం మీదుగా నీలిగోళంలా కనిపించే భూమిని.. సూర్యగ్రహణాన్ని.. చంద్రుడిపై దాదాపు 950 కిలోమీటర్ల మేర విస్తరించిన భారీ ఉల్కాపాతబిలం (ఓరియంటేల్ ఇంపాక్ట్ బేసిన్) వంటివాటిని వేయి కళ్లు చేసుకుని చూశారు.



నలుగురు వ్యోమగాములూ ఇద్దరిద్దరుగా విడిపోయి.. ఓరియన్ స్పేస్‌క్రాఫ్ట్ కిటికీల వద్ద చేరి..నరమానవులెవరూ చూడని దృశ్యాలను కన్నులారా తిలకించి పులకించిపోయారు. ఆ దృశ్యాలన్నింటినీ కెమెరా కళ్లతో చిత్రీకరించారు. ఈ మిషన్‌లో భాగంగా చంద్రుడి చెంతకు వెళ్లిన తొలి మహిళ క్రిస్టినా కోచ్.. “చంద్రుడిని అంత దగ్గర్నుంచీ చూస్తుంటే నాకు ఒక్కసారిగా గాఢమైన భావోద్వేగం కలిగింది.” అని పేర్కొన్నారు. దీపపు సెమ్మెలోని రంధ్రాల నుంచి వచ్చే కాంతిలా.. చందమామపై కనిపించిన ప్రకాశవంతమైన బిలాలను చూసి ఆశ్చర్యపోయానని పేర్కొన్నారు. కాగా.. సోమవారం అర్ధరాత్రి దాటాక చంద్రుడి ఆవలివైపునకు చేరుకున్న ఈ వ్యోమనౌక మళ్లీ భూమి దిశగా ప్రయాణిస్తోంది. గంటకు 40 వేల కిలోమీటర్లకు పైగా వేగంతో భూవాతావరణంలోకి ప్రవేశించి.. అమెరికా కాలమానం ప్రకారం శుక్రవారం రాత్రి 8.07 గంటలకు.. శాన్‌డియోగో తీరానికి సమీపాన సముద్రంలో దిగనుంది.

సమగ్ర తెలుగు దినపత్రిక
అడుగు
The Step Towords The Truth..

# బీసీసీఐతో కాళ్ల బేరానికి బంగ్లాదేశ్..

భారత్ క్రికెట్ నియంత్రణ మండలి(బీసీసీఐ)తో సంబంధాలను మెరుగుపర్చుకోవడమే లక్ష్యంగా పెట్టుకున్న బంగ్లాదేశ్ కొత్త ప్రభుత్వం.. ఆ దిశగా చర్యలు చేపట్టింది. భారత్‌కు వ్యతిరేక నిర్ణయాలు తీసుకున్న బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు(బీసీబీ) చీఫ్ అమీనుల్ బల్బుల్‌పై వేటు వేసింది. ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 టోర్నీ ఆడేందుకు భారత్‌కు 2026 సీజన్ నుంచి బంగ్లాదేశ్ పేసర్ ముస్తాఫిజుర్ రెహమాన్‌ను తొలగించాలని కేకేఆర్ టీమ్‌ను బీసీసీఐ ఆదేశించడంతో వివాదం మొదలైంది. ఈ నిర్ణయంపై ఆగ్రహించిన బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు.. ఐసీసీ టీ20 ప్రపంచకప్ కోసం భారత్‌లో పర్యటించకూడదని నిర్ణయించుకుంది. అయితే కొత్త క్రీడా మంత్రి అమీనుల్ హక్ ఐసీసీతో



వెళ్లమని, తమ మ్యాచ్‌లను శ్రీలంకకు తరలించాలని అప్పట్లో అమీనుల్ బల్బుల్ డిమాండ్ చేశాడు.పాకిస్థాన్ మాటలు పట్టుకొని టోర్నీ నుంచి తప్పుకున్నారు. అయితే ఈ నిర్ణయాన్ని తప్పుబట్టిన బంగ్లాదేశ్ నయా ప్రభుత్వం అతనిపై చర్యలు తీసుకుంది.

బోర్డు కార్యవర్గాన్ని పూర్తిగా రద్దు చేసి బంగ్లాదేశ్ మాజీ కెప్టెన్ తమీమ్ ఇక్బాల్ నేతృత్వంలో 11 మంది సభ్యులతో కూడిన తాత్కాలిక కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. బీసీబీలో తదుపరి ఎన్నికలు జరిగే వరకు ఈ కమిటీ బాధ్యతలు నిర్వహిస్తుందని పేర్కొంది.తమీమ్ ఇక్బాల్ నేతృత్వంలోని ఈ బోర్డులో రష్నా ఇమామ్, మీర్జా యాసిర్ అబ్బార్, సయ్యద్ ఇబ్రహీం అహ్మద్, ఇస్రాఫిల్ ఖోస్రూ, మిన్హాజుల్ అబెడిన్ నాన్నూ, అథర్ అలీ ఖాన్‌లు ఉన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో బంగ్లాదేశ్‌లో జాతీయ ఎన్నికల జరగ్గా.. కొత్త ప్రభుత్వం కొలువు దీరింది. అంతకుముందు మహమ్మద్ యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం భారత్‌కు వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకుంది. భారత్‌పై అక్కసుతో ఐసీసీ టీ20 ప్రపంచకప్ టోర్నీని బహిష్కరించింది. ఐపీఎల్ సంప్రదింపులు జరిపి బోర్డు నాయకత్వంలో మార్పులు ఉంటాయని సూచించారు. భారత్‌తో దెబ్బతిన్న సంబంధాలను మెరుగుపరుచుకోవడానికి బంగ్లాదేశ్ కొన్ని కీలక నిర్ణయాలు తీసుకుంది. దేశంలో ఐపీఎల్ 2026 మ్యాచ్‌ల ప్రసారంపై ఉన్న నిషేధాన్ని తొలగించింది. గతంలో టీ20 ప్రపంచకప్ విషయంలో బోర్డు తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకించిన తమీమ్ ఇక్బాల్‌కు బోర్డు బాధ్యతలు అప్పగించింది. గతంలో తమీమ్ ఇక్బాల్ భారత్‌కు అనుకూలంగా మాట్లాడారని బీసీబీ డైరెక్టర్ ఎం. నజ్ముల్ ఇస్లాం ఆయన్ని "ఇండియన్ ఏజెంట్" అని విమర్శించడం పెద్ద వివాదానికి దారితీసింది. ఆ తర్వాత నజ్ముల్‌ను పదవి నుంచి తొలగించారు.రాబోయే కాలంలో మూడు వన్డేలు, టీ20 సిరీస్ కోసం భారత జట్టు బంగ్లాదేశ్‌లో పర్యటిస్తుందా లేదా అనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. గతేడాది రాజకీయ ఉద్రిక్తతల కారణంగా భారత జట్టు పర్యటన వాయిదా పడింది. అలాగే బంగ్లాదేశ్ మహిళల జట్టు భారత పర్యటన కూడా రద్దయింది. ఇరు దేశాల మధ్య సత్సంబంధాలు మెరుగవుతుండటంతో తిరిగి క్రికెట్ సంబంధాలు కూడా మొదలవ్వనున్నాయి.

# నటితో క్రికెటర్ అర్షదీప్ సింగ్ డేటింగ్!

ఐపీఎల్ 2026లో టీమిండియా పేసర్ అర్ష్‌దీప్ సింగ్ పంజాబ్ కింగ్స్ జట్టుకు ప్రాతినిథ్యం వహిస్తున్నాడు. తాజాగా తన వ్యక్తిగత జీవితంతో అర్షదీప్ వార్తల్లో నిలిచాడు. క్రికెటర్ ఒక అమ్మాయి చేయి పట్టుకున్నట్లు కనిపిస్తున్న ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. కొంతమంది అభిమానులు చేతిపై టాటూ, గోళ్లపై ఉన్న ఆర్ట్ గుర్తించి, ఆమె మరెవరో కాదు సబ్రీన్ కౌర్ అని చెబుతున్నారు. ఇక అది మొదలుకుని అర్షదీప్, సబ్రీన్ ప్రేమలో ఉన్నారని ప్రచారం జరుగుతోంది. అర్ష్‌దీప్ సింగ్ షేర్ చేసిన ఫోటోలలో తను ఒక అమ్మాయి చేయి పట్టుకున్నాడు. కానీ అందులో ఆమె ముఖం కనిపించడం లేదు. అమ్మాయి చేతిపై చిన్న టాటూ మాత్రం ఉంది. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే అభిమానులు ఈ టాటూతో అమ్మాయి ఎవరని గుర్తించారు. ఆమె పంజాబీ నటి సబ్రీన్ కౌర్ అని చెబుతున్నారు. క్రికెటర్ ఫోటోలో అమ్మాయి చేతిపై ఉన్న టాటూ, చేతిపై ఉన్న టాటూ ఒకేలా ఉన్నాయని అంటున్నారు. ఆ తర్వాత సబ్రీన్ కౌర్ మ్యాచ్‌లు చేసేందుకు స్టేడియానికి రాగా.. ఆ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఆమె స్వయంగా తన ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్లో ఫొటోలు షేర్ చేసింది. ఈ ఐపీఎల్ టైం ఫొటో కాదని, గత ఏడాది తీసిన ఫోటోస్ అని నెటిజన్స్ కామెంట్ చేస్తున్నారు. పంజాబీ సినీ పరిశ్రమలో ఎదుగుతున్న నటి సబ్రీన్ కౌర్. ఆమె సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటారు. పలు మ్యూజిక్ వీడియోలలో నటించింది. ఆమెకు ఇన్‌స్టాగ్రామ్‌లో 4.4 మిలియన్ల ఫాలోవర్లు ఉన్నారు. క్రికెట్ ప్రపంచ కప్ 1983 విజయంపై తీసిన 83 సినిమాలో నటించింది. సబ్రీన్ కౌర్ 2021లో జమ్మూ కాశ్మీర్‌లో పుట్టింది. స్టార్ పేసర్ అర్ష్‌దీప్ సింగ్ కంటే వయసులో ఒక ఏడాది చిన్న. సోషల్ మీడియాలో ఫొటోలు చూసిన నెటిజన్స్ వీరిద్దరూ టచ్‌లో ఉన్నారని, డేటింగ్ చేస్తున్నారని కామెంట్ చేయడంతో విషయం వైరల్ అయింది. అయితే వారి మధ్య రిలేషన్ గురించి జరుగుతున్న ప్రచారంలో అర్షదీప్, సబ్రీన్ కూడా రియాక్ట్ కాలేదు.







# సీఎస్‌కేలో పెను మార్పులు తప్పవా?

ఐపీఎల్ 2026 సీజన్‌లో పాత వైభవానికి దూరమైన చెన్నై సూపర్ కింగ్స్ జట్టు ప్రస్తుతం అత్యంత క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటోంది. ఇటీవల రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ( తో జరిగిన మ్యాచ్‌లో ఎదురైన ఘోర పరాజయం జట్టు ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసింది. ఈ నేపథ్యంలో, తదుపరి మ్యాచ్‌లో జట్టును తిరిగి విజయాల బాట పట్టించేందుకు యాజమాన్యం, కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ భారీ మార్పులకు శ్రీకారం చుట్టనున్నారు. ప్రధానంగా దిగ్గజ ఆటగాడు ఎంఎస్ ధోనీ కీలక బాధ్యతల్లో కనిపించనుండగా, 'బేబీ ఏబీ'గా పిలవబడే డెవాల్డ్ బ్రెవిస్ తుది జట్టులోకి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆర్సీబీతో జరిగిన పోరులో సీఎస్‌కే బ్యాటింగ్ మరియు బౌలింగ్ విభాగాల్లో పూర్తిగా విఫలమైంది. ప్రత్యర్థి జట్టు భారీ స్కోరు సాధిస్తున్నా బౌలర్లు కట్టడి చేయలేకపోయారు. ముఖ్యంగా డెత్ ఓవర్లలో సీఎస్‌కే బౌలింగ్ దారుణంగా ఉంది. బ్యాటింగ్‌లో కూడా టాపార్డర్ విఫలమవ్వడం జట్టును పతనం అంచుకు తీసుకెళ్లింది. ఈ పరాజయంపై సోషల్ మీడియాలో అభిమానులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.గత కొన్ని మ్యాచ్‌లుగా ధోనీ కేవలం బ్యాటింగ్‌కు మాత్రమే పరిమితమవుతున్నారు. అయితే, జట్టు కష్టాల్లో ఉన్నప్పుడు ధోనీ అనుభవం అవసరమని యాజమాన్యం భావిస్తోంది. మైదానంలో వ్యూహరచనలో కెప్టెన్ రుతురాజ్‌కు ధోనీ మరింత చురుగ్గా సహకరించనున్నారు. ముఖ్యంగా ఫీల్డ్ సెట్టింగ్, బౌలింగ్ మార్పుల విషయంలో ధోనీ మార్క్ నిర్ణయాలు తదుపరి మ్యాచ్‌లో కనిపిస్తాయని సమాచారం. ధోనీ ఫిట్‌నెస్‌పై కొన్ని అనుమానాలు ఉన్నప్పటికీ, జట్టును గట్టెక్కించేందుకు ఆయన సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది.దక్షిణాఫ్రికా యువ సంచలనం డెవాల్డ్ బ్రెవిస్ ప్రస్తుతం సీఎస్‌కే బెంచ్‌కే పరిమితమయ్యాడు. కానీ, మిడిలార్డర్ విఫలమవుతుండటంతో అటాకింగ్ బ్యాటర్ అవసరమని జట్టు భావిస్తోంది. బ్రెవిస్ తనదైన శైలిలో సిక్సర్ల వర్షం కురిపించగలడు. ముఖ్యంగా స్పిన్నర్లను ఎదుర్కోవడంలో అతని సామర్థ్యం జట్టుకు అదనపు బలంగా మారుతుంది. విదేశీ ఆటగాళ్ల కోటాలో ఒకరిని తప్పించి బ్రెవిస్‌ను తుది జట్టులోకి తీసుకునే యోచనలో కోచ్ ఫ్లెమింగ్ ఉన్నట్లు నివేదికలు చెబుతున్నాయి.

సీఎస్‌కే ప్లేఆఫ్స్ అవకాశాలు సజీవంగా ఉండాలంటే తర్వాతి మ్యాచ్‌లో ఖచ్చితంగా గెలవాల్సి ఉంటుంది. ఈ క్రమంలోనే జట్టులో సమతుల్యత కోసం కసరత్తులు జరుగుతున్నాయి.



సమగ్ర తెలుగు దినపత్రిక
అడుగు
The Step Towords The Truth..




# అవును పెళ్లయ్యింది.. నలుగురు పిల్లలు

## విమర్శకులకు నటి త్రిష ఘాటు రిప్లై

కొన్ని రోజులుగా నటి త్రిష పేరు సోషల్ మీడియాలో వైరలవుతోన్న విషయం తెలిసిందే. నటుడు, టీవీకే అధినేత విజయ్‌తో ఆమె రిలేషన్‌లో ఉన్నట్లు వార్తలు వచ్చాయి. తాజాగా త్రిష సినిమాలు మానేస్తున్నారని నటుడు చిత్రా లక్ష్మణన్ ఓ యూట్యూబ్ ఇంటర్వ్యూలో చెప్పడం తీవ్ర చర్చకు దారితీసింది. దీనిపై ఆమె తనదైన స్టైల్‌లో కౌంటర్ ఇచ్చారు. ఇన్‌స్టా స్టోరీలో ఈ వ్యాఖ్యలపై పరోక్షంగా స్పందించారు. అవును సినిమాలు మానేశాను. ఒక పెద్ద వ్యాపారవేత్తను పెళ్లి చేసుకొని నలుగురు పిల్లల్ని కన్నాను. మీ ఊహాగానాలకు ఇది సరిపోతుందా?. ఈరోజు మీరు వార్తలు రాసుకోవడానికి ఇది చాలా.. మరేదైనా జోడించమంటారా' అంటూ వ్యంగ్యంగా రాసుకొచ్చారు.. దీంతో ఆమె సినిమాలు మానేయనున్నారంటూ వస్తోన్న వార్తలకు చెక్ పడినట్లైంది. అసలేం జరిగిందంటే.. యూట్యూబ్ వేదికగా ఓ నెటిజన్ అడిగిన ప్రశ్నకు చిత్రా లక్ష్మణన్ బదులిచ్చారు. ఇకపై సినిమాల్లో కొనసాగాలని త్రిష అనుకోవడం లేదని.. అవకాశాలనూ అందిపుచ్చుకోవడం లేదన్నారు. దీంతో ఎన్నో ఊహాగానాలు మొదలయ్యాయి. ఆమె పాలిటిక్స్‌పై ఫోకస్ పెట్టనున్నారని వార్తలు వచ్చాయి. తాజా పోస్ట్‌తో వీటికి తనదైన స్టైల్‌లో త్రిష బదులిచ్చారు. ప్రస్తుతం ఆమె సూర్య 'కరుప్పు'(తెలుగులో 'వీరభద్రుడు'), 'విశ్వంభర'లో నటిస్తున్నారు.





# ప్రభాస్‌తో ఆదిత్య ధర్ మూవీ

'ధురంధర్ 2' ఘన విజయం తర్వాత దర్శకుడు ఆదిత్య ధర్ పేరు ఇండియన్ సినిమా ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లు సాధించి, రికార్డుల సునామీ సృష్టించడంతో ఆయన తదుపరి ప్రాజెక్ట్‌పై ఆసక్తి మరింత పెరిగింది. తాజా సమాచారం ప్రకారం, ఆదిత్య ధర్ ఇప్పుడు మరో భారీ ప్రాజెక్ట్‌కు శ్రీకారం చుడుతున్నారని తెలుస్తోంది.టాలీవుడ్, కోలీవుడ్ ఇండస్ట్రీలను కలిపి పాన్ ఇండియా స్థాయిలో ఇండియన్ సినిమాను షేక్ చేసేలా ఓ మల్టీస్టారర్‌ను తెరకెక్కించాలనే ఆలోచనలో ఉన్నారట. ఆ చిత్రంలో ప్రభాస్,సూర్య కలిసి నటించబోతున్నారని బాలీవుడ్ సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఈ ప్రాజెక్ట్ హై వోల్టేజ్ మాస్ యాక్షన్ థ్రిల్లర్‌గా ఉండబోతోందని టాక్. ఇద్దరు స్టార్ హీరోలు కావడంతో వారి పాత్రలకు సమాన ప్రాధాన్యం ఉండేలా పవర్‌ఫుల్ క్యారెక్టర్స్‌ను రూపొందిస్తున్నారని సమాచారం. కథ కూడా పాన్ ఇండియా రేంజ్‌లో ఉండి, దేశ విదేశాల్లోని పలు ఇంటర్నేషనల్ లొకేషన్స్‌లో షూటింగ్ ఎ÷-లాన్ చేస్తున్నారట.ప్రభాస్‌కు ఉన్న పాన్ ఇండియా మార్కెట్, సూర్యకు ఉన్న నటనా ప్రతిభ ఈ రెండు కలిస్తే బాక్సాఫీస్ వద్ద భారీ సంచలనం ఖాయం అని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. ముఖ్యంగా యాక్షన్ సీక్వెన్స్‌లు, ఎమోషనల్ డ్రామా మధ్య మంచి బ్యాలెన్స్ ఉండేలా స్క్రిప్ట్ సిద్ధం చేస్తున్నారట. అయితే ఈ ప్రాజెక్ట్‌పై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. అయినప్పటికీ ఈ వార్తలు సోషల్ మీడియా, సినీ వర్గాల్లో వైరల్ అవుతూ అభిమానుల్లో ఆసక్తిని పెంచుతున్నాయి. ప్రభాస్, సూర్య కాంబినేషన్ నిజమైతే ఇది ఇండియన్ సినిమా చరిత్రలోనే ఒక క్రేజీ ప్రాజెక్ట్‌గా నిలుస్తుందని ఫ్యాన్స్ ఇప్పటికే అంచనాలు పెంచుకుంటున్నారు. ఇక అధికారిక ప్రకటన ఎప్పుడు వస్తుందో చూడాలి.

# అట్లీ, అల్లు అర్జున్ మూవీ పోస్టర్ విడుదల

అల్లు అర్జున్ హీరోగా అట్లీ దర్శకత్వంలో ఓ పాన్ ఇండియా సినిమా రూపొందుతోన్న విషయం తెలిసిందే. 'ఎఎ22ఎక్స్ 6'గా ఇది ప్రచారంలో ఉంది. తాజాగా దీనికి సంబంధించిన అప్‌డేట్‌ను చిత్రబృందం పంచుకుంది. అల్లు అర్జున్ పుట్టినరోజు సందర్భంగా బుధవారం దీని టైటిల్‌ను ప్రకటించనున్నట్లు వెల్లడించింది. ఈ విషయాన్ని తెలుపుతూ టీమ్ పంచుకున్న పోస్టర్ అందరిలో ఆసక్తి కలిగించింది. సాధారణంగా టైటిల్ ప్రకటన అంటే హీరో లుక్‌కు సంబంధించిన పోస్టర్‌ను పంచుకుంటారు. కానీ టీమ్ మాత్రం జంతువు పంజా ఉన్న పోస్టర్‌ను షేర్ చేసింది. దీంతో ఈ సినిమా థీమ్‌పై సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది. అట్లీ ఏం ప్లాన్ చేస్తున్నారంటూ కామెంట్స్ చేస్తున్నారు. పునర్జన్మల కాన్సెప్ట్‌తో ముడిపడి ఉండే సైన్స్‌ఫిక్షన్ మూవీగా ఇది ముస్తాబవుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇందులో అల్లు అర్జున్ పాత్ర మూడు కోణాల్లో సాగుతుందని సమాచారం. మోషన్ క్యాప్చర్ టెక్నాలజీ వినియోగంతో పాటు... విజువల్ ఎఫెక్ట్స్‌కి పెద్దపీట వేస్తూ ఈ సినిమాని భారీస్థాయిలో తెరకెక్కిస్తున్నారు. ఇందులో ముగ్గురు కథానాయికలు ఉన్నట్లు తెలుస్తోంది. వారిలో దీపికా పదుకొణె పేరు ఇప్పటికే ఖరారైంది.

# పెద్ది విడుదల జూన్‌కు మారినట్లేనా?

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా రూపొందుతున్న పాన్ ఇండియా చిత్రం పెద్ది విడుదల తేదీపై గందరగోళం నెలకొంది. మొదట ఈ సినిమాను ఏప్రిల్ 30న విడుదల చేస్తామని ప్రకటించినప్పటికీ, తాజా పరిణామాలు చూస్తుంటే



ఆ తేదీకి రావడం కష్టమేనని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. ఇటీవల 'చెన్నై లవ్ స్టోరీ' ఈవెంట్‌లో నిర్మాత ఎస్‌కేఎన్ సినిమా వాయిదా పడే అవకాశాలపై వ్యాఖ్యలు చేయడంతో మెగా అభిమానులు తీవ్రంగా స్పందించారు. ఈ వ్యాఖ్యలపై వివాదం రేగడంతో ఆయన తర్వాత వివరణ ఇచ్చారు. మరోవైపు, 'రాకాస' టీంతో మాట్లాడిన సమయంలో 'సినిమా లేట్ అవ్వదు' అని రామ్ చరణ్ స్వయంగా చెప్పడంతో ఫ్యాన్స్ కాస్త కూల్ అయ్యారు. అయినప్పటికీ, ప్రస్తుత పరిస్థితులు చూస్తే వాయిదా అనివార్యంగా కనిపిస్తోంది. తాజా సమాచారం ప్రకారం, 'పెద్ది' సినిమా జూన్ నెలలో విడుదలయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం చిత్ర యూనిట్ రెండు తేదీలను పరిశీలిస్తోంది. జూన్ 4 లేదా జూన్ 24. ఈ తేదీల్లో ఏదో ఒకదానిని ఫైనల్ చేయాలని భావిస్తున్నారు. త్వరలో అధికారిక ప్రకటన వచ్చే అవకాశముంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో షూటింగ్ వేగంగా కొనసాగుతోంది. కీలక సన్నివేశాల్లో రామ్ చరణ్ పాల్గొంటూ బిజీగా ఉన్నారు. సినిమాను అత్యుత్తమంగా తీర్చిదిద్దేందుకు టీమ్ కష్టపడుతోంది. ఈ చిత్రంలో రామ్ చరణ్ సరసన జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ముఖ్య పాత్రల్లో శివరాజ్ కుమార్, జగపతిబాబు , అలాగే 'మిర్జాపూర్' ఫేమ్ దివ్యేందు శర్మ కనిపించనున్నారు. సంగీతాన్ని ఏఆర్ రెహమాన్ అందిస్తుండగా, ఇప్పటికే విడుదలైన పాటలు మంచి స్పందన పొందాయి. మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై తెరకెక్కుతున్న ఈ సినిమా మీద అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. రిలీజ్ డేట్‌పై క్లారిటీ రాగానే ప్రమోషన్స్‌ను మరింత వేగంగా ముందుకు తీసుకెళ్లేలా యూనిట్ ప్లాన్ చేస్తోంది.

Printed, Published & Owned by Margam Rama on behalf of ADUGU DIGITAL MEDIA Pvt. Ltd, Printed and Published at ADUGU PRESS, H No: 7-120, PALAKURTHI Village & Mandal, Jangaon District, Telangana, PIN: 506146. Chief Editor: Dr.Margam Lakshmi Narayana, Ph.No. : 8499990005